క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలో విద్యార్థి ప్రతిభ



ధరూరు: ఈ 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు మేడ్చల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలలో మండల కేంద్రానికి చెందిన విద్యార్థి నరేష్ ప్రతిభ కనబరిచినట్లు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రతాప్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాసులు తెలిపారు. అండర్ 14 విభాగంలో బాల బాలికలకు నిర్వహించిన ఈ పోటీల్లో మహబూబ్‌నగర్ జిల్లా తరపున పాల్గొని రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. ఈ నెల 22 నుంచి ఒరిస్సా లోని భువనేశ్వర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ఈ విద్యార్థి పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థిని పాఠశాల ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

బడీడు పిల్లలు బడిలోనే ఉండాలి



కేటీదొడ్డి: బడీడు పిల్లలు బడిలోనే ఉండాలని సీఆర్‌పీ యుగంధర్ అన్నారు. బుధవారం మండలంలోని పాగుంట గ్రామంలోని కాంప్లెక్స్ హెచ్‌ఎం హనుమంతు, స్వాతిలు గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ సర్వే చేసి ఆరుగురిని బడి బయట పిల్లలను గుర్తించారు. వారు మాట్లాడుతూ బడీడు పిల్లలు తప్పకుండా బడిలో ఉండాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాకేష్, రఘు ఉన్నారు.

దళితుల ఆకాంక్షలు నెరవేర్చాలి



గద్వాల అర్బన్: గత ప్రభుత్వం దళితులకు ఇచ్చిన వాగ్దానాలను విస్మరించిందని, వాటిని నూతన ప్రభుత్వం చిత్తశుద్ధితో నెరవేర్చాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు మారెన్న అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితులకు విద్య, వైద్యం ప్రభుత్వం దృష్టి పెట్టాలని, దళితబంధు పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని, ఇళ్లు లేని దళితులకు ఇండ్లు నిర్మించాలని, ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు సబ్సిడీ విడుదల చేయాలని, ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6గ్యారంటీలని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి రాజు, సభ్యులు పరంజ్యోతి, విజయ్‌కుమార్, ఆంజనేయులు, సవారన్న ఉన్నారు.

గడ్డివాము దగ్ధం



కేటీదొడ్డి: మండలంలోని వెంకటాపురం గ్రామ శివారులోని బుధవారం మధ్యాహ్నం సిద్ది రంగారెడ్డి రైతుకు చెందిన గడ్డివాము విద్యుత్ తీగలు తగిలి అగ్నికి అహుతైంది. ఈ విషయం తెలుసుకున్న రైతు మంటలను ఆర్పేందుకు చుట్టు పక్కల రైతులు ప్రయత్నించారు. మంటలు అదుపులోకి రాకపోవడంతో అగ్నిమాపక వాహనానికి సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను పూర్తిగా ఆర్పేసింది. ఈ ప్రమాదంలో సుమారు రూ. 50 వేలు ఆస్తి నష్టం సంభవించినట్లు రైతులు తెలిపారు.

దుకాణాల సముదాయం పూర్తయ్యేదెప్పుడో?



శాంతినగర్: వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్‌లో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు ఎప్పుడు పూర్తవుతాయోనని చిరు వ్యాపారులు, ప్రజలు ఎదురుచూస్తున్నారు. శాంతినగర్ రాజోళి రోడ్డుకు సమీపంలో మార్కెట్ నిర్మాణపనులు చేపడుతున్నారు. మూడు నెలలుగా పనులు నిలిచిపోయాయి. దీంతో చిరు వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై మున్సిపాలిటీ శాఖ ఉన్నతాధికారులు స్పందించి మార్కెట్ భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేసి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

హరితహారానికి ఏర్పాట్లు షురూ

- మొక్కల పెంపకంపై నిమగ్నమైన నర్సరీ నిర్వాహకులు
- నర్సరీలను పరిశీలిస్తున్న మండల, జిల్లా అధికారులు



అమరవాయి నర్సరీలో మట్టిని నింపిన దృశ్యం



మద్దెలబండలో..

మల్దకల్: 2024 హరితహారంలో మొక్కలు నాటేందుకు ప్రభుత్వం ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. అందులో భాగంగానే ప్రతి గ్రామ పంచాయతీకి ఒక నర్సరీని ఏర్పాటు చేయడంతో పాటు అందులో 10వేల మొక్కలను పెంచేందుకు చర్యలు చేపట్టింది. హరితహారం నాటికి నర్సరీలలో మొక్కలు సిద్ధంగా ఉండేందుకు ఇప్పటి నుంచే అధికారులు ఏర్పాట్లను పరిశీలించడంతో పాటు ఎప్పటికప్పుడు జిల్లా అధికారులు తనిఖీ చేస్తున్నారు. గద్వాల నియోజకవర్గంలోని మల్దకల్ మండలంలో 25గ్రామ పంచాయతీల పరిధిలో 25న ర్సరీలను ఏర్పాటు చేసి అందులో 2.50లక్షల మొక్కలను పెంచేందుకు చర్యలు చేపట్టారు. గట్టులో 27 పంచాయతీలలో 27 నర్సరీలలో 2.70లక్షల మొక్కలు, గద్వాలలో 28 పంచాయతీలలో 28 నర్సరీలను ఏర్పాటు చేసి 2.80లక్షల మొక్కలు, కేటీదొడ్డిలో 23పంచాయతీలలోని 23నర్సరీలను ఏర్పాటు చేసి 2.15లక్షల మొక్కలను, ధరూరు మండలంలోని 28పంచాయతీలలో 28నర్సరీలలో 2.80లక్షల మొక్కలను పెంచేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఆయా గ్రామపంచాయతీలకు నిర్దేశించిన లక్ష్యం మేరకు నర్సరీలలో మొక్కలను పెంచి హరితహారం నాటికి సిద్ధం చేయాలని మండల ఎంపీడీఓలు, ఏపీఓలు నిర్వాహకులకు సూచిస్తున్నారు. ఏయే గ్రామ పంచాయతీలో ఎన్ని మొక్కలు పెంచాలనే లక్ష్యాన్ని ఉన్నతాధికారులు ఇప్పటికే నర్సరీ నిర్వాహకులకు ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు ఇచ్చారు. ప్రస్తుతం నర్సరీలలో కవర్లలో మట్టిని నింపి మొక్కలు ఏర్పాటు చేసేందుకు కూలీలతో పనులను ముమ్మరంగా చేపడుతున్నారు. కవర్లలో మట్టిని రెండు భాగాలలో ఎర్రమట్టి, ఒక భాగంలో నల్లమట్టి, ఒక భాగంలో ఎరువును మిశ్రమం చేసి కవర్లలో మట్టిని పూర్తిస్థాయిలో నింపడం జరుగుతుందని ఎంపీడీఓ కృష్ణయ్య తెలిపారు. మొక్కలకు ఎలాంటి చీడపీడల బెడద లేకుండా ఫ్లోరైడ్ గుళికలను అందులో వేసి కవర్లను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. గతేడాది హరితహారంలో మిగిలిన మొక్కలను మరో కవర్లలోకి మార్చి వాటిని సంరక్షించాలన్నారు. నర్సరీలలో విత్తనాలు నారును పెంచి వాటికి ఉదయం, సాయంత్రం వేళలో నీరందించాలన్నారు. అనంతరం వాటిని కవర్లలో ఏర్పాటు చేసి హరితహారం నాటికి మొక్కలను అందుబాటులోకి తీసుకురావాలని నర్సరీ నిర్వాహకులకు అధికారులు సూచించారు.

మొక్కల పెంపకంపై దృష్టి పెట్టాం..



అధికారులు నిర్దేశించిన లక్ష్యం మేరకు మా నర్సరీలో మొక్కలను పెంచి హరితహారం నాటికి అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రతిరోజు నర్సరీలో మొక్కలు పెంచేందుకు కవర్లలో మట్టిని నింపి, నారుమడులలో విత్తనాలను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– రంగన్న, నర్సరీ నిర్వాహకుడు, అమరవాయి

లక్ష్యం మేరకు మొక్కలు పెంచాలి



ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు ఆయా గ్రామాలకు కేటాయించిన నర్సరీలలో మొక్కలు పెంచేందుకు నిర్వాహకులు చర్యలు తీసుకోవాలి. ఇప్పటికే 80శాతం పనులు పూర్తిచేయడం జరిగింది. మిగిలిన 20శాతం పనులను ఈనెల 20లోపు పూర్తి చేసి అన్ని నర్సరీలలో మొక్కలు పెంచేందుకు ఏర్పాట్లు పూర్తిచేస్తాం.

– కృష్ణయ్య, ఎంపీడీఓ మల్దకల్

ఈనెల 20లోపు పనులు పూర్తి చేయాలి



హరితహారాన్ని విజయవంతం చేసేందుకు నియోజకవర్గంలోని అన్ని నర్సరీలలో నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలను పెంచాలి. గతేడాది మిగిలిన మొక్కలను మరో కవర్లలోకి మార్చి వాటిని సంరక్షించాలి. నిర్లక్ష్యం వహించే నిర్వాహకులపై చర్యలు తీసుకుంటాం.

– కాంతమ్మ, డీఆర్‌డీఓ

సమస్యల పరిష్కారానికి కృషి చేద్దాం



ఎమ్మెల్సీ చల్లా, ఎమ్మెల్యే విజేయుడులకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీడీఓలు

అలంపూర్: గ్రామీణ సమస్యల పరిష్కారానికి కలిసికట్టుగా పని చేద్దామని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు అన్నారు. కర్నూల్‌లోని నివాసంలో ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడును నియోజకవర్గంలోని ఎంపీడీఓలు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు. సందర్భంగా ఎంపీడీఓలు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే ఎంపీడీఓలతో మాట్లాడారు. నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో ప్రజలకు ఇబ్బందికరంగా ఉన్న సమస్యలు ఎప్పటికీ అప్పుడు పరిష్కరించాలని సూచించారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకరావాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అందరు కలిసికట్టుగా సమన్వయంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓలు గోవిందరావు, రమణారావు, రాఘవ, రవీందర్, సాయిప్రకాష్, వడ్డేపల్లి ఎంపీఓ తిరుపతన్న ఉన్నారు.

ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలను కలిసిన పంచాయతీ కార్యదర్శులు

అలంపూర్ నియోజకవర్గంలోని నివాసంలో ఎమ్మెల్సీ చల్లా వెకంట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడును నియోజకవర్గంలోని పంచాయతీ కార్యదర్శుల సంఘం సభ్యులు బుధవారం కలిసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఎమ్మెల్యేకు సన్మానం

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని పొగాకు కంపెనీ దగ్గర ఇటీవల ఏర్పాటు చేసిన ఆదిత్య ఫ్యామిలీ రెస్టారెంట్‌ను బుధవారం ఎమ్మెల్యే విజయుడు సందర్శించారు. ఈ సందర్భంగా రెస్టారెంట్ నిర్వాహకులు ఎమ్మెల్యేకు పూల బొకేను అందించి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పూలమాలలు వేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కేజీబీవీ పరిశీలించిన అధికారులు



ఉండవెల్లి: మండలంలోని కలుగోట్ల గ్రామంలోని కస్తూర్బా పాఠశాలను జీసీఈఓ ఫర్జానా ఆధ్వర్యంలో పలు తరగతులను, మధ్యాహ్న భోజనాన్ని ఆమె పరిశీలించారు. పలు రికార్డులను జీసీఈఓ పరిశీలించి, పలు అంశాలపై ఆరా తీశారు. నూతన భవనాన్ని త్వరలో ప్రారంభించి సమస్యలను తలెత్తకుండా చూస్తామని ఎస్ఓ పరిమళ అధికారులకు తెలిపారు. విద్యార్థుల నైపుణ్యాన్ని ఆరా తీశారు. కార్యక్రమంలో అధికారులు రామకృష్ణ, సదామహేశ్వరి, రజనీ కుమార్, పురేందర్ రావ్, మల్లయ్య, రజి యా బేగం, గోపికృష్ణ, శ్రీదేవి పాల్గొన్నారు.

ప్రశాంతంగా సాధారణ సమావేశం



అయిజ: మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం ఎంపీపీ నాగేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన ఎంపీడీఓ సాయి ప్రకాష్ నిర్వహించిన సర్వసభ్య సమావేశం ప్రశాంతంగా జరిగింది. వివిధ శాఖల అధికారులకు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఆయా గ్రామాల్లోని సమస్యలను తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎన్ని పోస్టులు ఖాళీ ఉన్నాయో నివేదిక ఇవ్వాలని ఎంపీపీ నాగేశ్వర్‌రెడ్డి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ విష్ణును కోరారు. మండలంలో 78 మంది రైతులకు రైతు బీమా చెల్లించారని ఎంఏఓ శంకర్‌లాల్ తెలిపారు.ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ప్రజాప్రతినిధులు అధికారులకు వివరించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్యానల్ టీం కేజీబీవీ సందర్శన



కేజీబీవీని సందర్శించిన ప్యానల్ టీం సభ్యులు

అయిజ: ప్రభుత్వ ఆదేశానుసారం బుధవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బేబికళ ఆధ్వర్యంలో ప్యానల్ టీం సందర్శించారు. అన్ని క్లాస్ రూంలను పరిశీలించి సబ్జెక్ట్ టీచర్లకు సూచనలు చేశారు. విద్యార్థుల ప్రతిభన పరిశీలించారు. పదో తరగతి విద్యార్థినులకు పరీక్షల్లో ఉత్తీర్ణ సాధించడానికి సూచనలు చేశారు. స్నానపు గదులు, మరుగుదొడ్ల నిర్వహణ సరిగా లేకపోవడంతో కొంతమంది విద్యార్థినులు డ్రాప్ అవుట్ అ యినట్లు గమనించారు. ఈ విషయం ఉన్నతాధికారులకు తెలియజేస్తామని ఇన్‌చార్జ్ ఎంఈఓ నరసింహ పేర్కొన్నారు. ఉపాధ్యాయులు భీమేశ్వర్‌రెడ్డి, లక్ష్మీ రెడ్డి, శివ శంకర్‌రెడ్డి, సంపూర్ణ, వెంకటేష్ ఉన్నారు.

ప్రమాదాలకు పిలుపులు

- కానరాని సూచిక బోర్డులు
- వాహనదారుల ఆందోళన



మైలగడ్డ-అల్లపాడు రోడ్డులోని మలుపు



ఉమిత్యాల-కొండాపురం మధ్య మలుపు

కేటీదొడ్డి: మండలంలో పలు గ్రామాలకు వెళ్లే రోడ్లపై మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఫలితంగా ప్రమాదాలు అధికమవుతున్నాయి. మైలగడ్డ, అల్లపాడు, ఉమిత్యాల, కేటీదొడ్డి, కొండాపురం, గంగన్‌పల్లి గ్రామాల మధ్యన మలుపులతో ప్రమాదకరంగా ఉంది. వాహనదారులు దగ్గరకు వస్తే కానీ అక్కడ ఉన్న సంగతి తెలియడం లేదు. ఈ మార్గంలో ఎప్పుడో ఏర్పాటు చేసిన సూచిక బోర్డులున్నా ఫలితం లేకుండా పోయింది. బోర్డుపై రేడియం అక్షరాలు కనిపించకపోవడంతో, ఈ మలుపుల వద్ద నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా యి. ఈ రహదారిపై వాహనదారులు ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా ప్రమాదానికి గురవుతున్నారు.

రాత్రిపూట భయం వేస్తుంది..

రాత్రి వేళల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉంటుంది. ఈ రహదారిపై ఎక్కువ రాత్రి వేళ్లలో లారీలు, డీసీఎంలు తిరుగుతుంటాయి. డ్రైవర్లు మద్యం తాగి అతివేగంగా వాహనాలు నడుపుతుండడంతో భయాందోళనకు గురవుతున్నారు. మూలమలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, వేగనియంత్రికలు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

పట్టించుకోవడం లేదు..



మలుపుల వద్ద అధిక ప్రమాదాలవుతున్నాయి. ఇటీవల అల్లపాడు, మైలగడ్డ, మధ్యన వెళ్లే మలుపుల దారిలో ఎన్నో ప్రమాదాలు జరిగిన ఘటనలున్నాయి. అయినా అధికారులుల్లో చలనం రావడం లేదు.

– కొండయ్య, కేటీదొడ్డి

స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలి..



మలుపుల వద్ద సరైనా సూచికబోర్డులు, స్పీ డు బ్రేకర్లు లేక ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్నాయి. లారీ డ్రై వర్లు మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు ఎక్కువ అవుతున్నాయి. మద్యం తాగి వాహనాలు నడిపే డ్రైవర్లపై చర్యలు తీసుకోవాలి.

– వెంకటేష్, కేటీదొడ్డి

అతి వేగాన్ని అదుపుచేయాలి..



గ్రామీణ ప్రాంతాలు రహదారులపై అతివేగాన్ని అదుపుచేస్తే ప్రమాదాలు తగ్గే అవకాశం ఉంది. రాత్రి వేళల్లో ఇష్టానుసారంగా నడుపుతున్నారు. మలుపుల వద్ద సూచిక బోర్డులు పెట్టాలి.

– రహిమాన్, ఈర్లబండ

కులాంతర వివాహాలకు ప్రోత్సాహకం



ప్రోత్సాహకం అందిస్తున్న ఎమ్మెల్యే బండ్ల

గద్వాల రూరల్: సమాజంలో కులాంతరాలు తగ్గించేందుకు కులాంతర వివాహాలు ఎంతో అవసరమని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం తన నివాసంలో కులాంతర వివాహాలు చేసుకున్న పలువురికి ప్రభుత్వ పరమైన పోత్సాహకాలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, ఎంపీపీ విజయ్, పార్టీ నాయకులు గోవిందు, ధర్మనాయుడు, కృష్ణారెడ్డి, వెంకటన్న పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు బహుమానం



ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు

అలంపూర్: క్యూబ్ హైవే రూట్ ఫౌండేషన్ వారు నేషనల్ హైవే వెంబడి ఉన్న గ్రామాల పాఠశాలలో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ చూపిన 32 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున బుధవారం అందజేశారు. నేషనల్ హైవేకు అటాచ్ ఉన్న గ్రామాల 26 పాఠశాలల విద్యార్థులకు మొత్తం రూ.3,20,000 అందజేశారు. కర్నూల్ నుంచి కొత్తకోటకు మధ్యలో ఉన్న పాఠశాలలో చదివిన విద్యార్థులందరికి కర్నూల్ లోని ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఏఐ టెక్నికల్ మేనేజర్ కోటబాబు, క్యూబ్ హైవే రూట్ ఫౌండేషన్ వీపీ అనుజ్ మైత్రేయి, ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్ట్ హెడ్ ప్రసాద్ రావ్, ఎక్స్‌ప్రెస్ వే నిమిటెడ్ వారు పాల్గొన్నారు.

ఓటు నమోదు కోసం దరఖాస్తుల స్వీకరణ



ఇటిక్యాలలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు



అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ హరికృష్ణ

ఎర్రవల్లిచౌరస్తా: జనవరి 1వ తేదీ వరకు 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులకు తప్పకుండా ఓటరుగా నమోదు చేయాలని ఇటిక్యాల తహసీల్దార్ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం ఇటిక్యాల మండల కేంద్రంలోని ప్రజా పరిషత్ కార్యాలయంలో బీఎల్‌వోలకు ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు నమోదుపై గ్రామాల్లో యువతకు అవగాహన కల్పించాలన్నారు. కొత్త ఓటర్లను నమోదు చేసి, మృతి చెందిన వారి ఓటును తొలగించాలన్నారు. పోలింగ్ కేంద్రానికి గ్రామం రెండు కిలోమీటర్లు దూరం ఉన్నా లేక ఒక పోలింగ్ కేంద్రంలో 1450 ఓటర్లకు పైగా ఉన్నా వారికి నూతన పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయవచ్చని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి ఓటు కీలకంగా ఉంటుందని 2024 ఓటరు జాబితాను ఎలాంటి తప్పులు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎర్రవల్లి తహసీల్దార్ నందిని, ఎంపీడీఓ రాఘవ, ఎస్ఐ అజిత్, ఆర్ఐలు సుదర్శన్‌రెడ్డి, భీమ్‌సేన్‌రావ్, ఆయా గ్రామాల బీఎల్‌ఓలు ఉన్నారు.

ఓటు నమోదు చేసుకోవాలి

మల్దకల్: గ్రామాల్లో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేయాలని తహసీల్దార్ హరికృష్ణ బీఎల్‌ఓలకు సూచించారు. మల్దకల్ మండల పరిషత్ సమావేశపు హాల్లో బీఎల్‌ఓలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు నమోదు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు నాగిరెడ్డి, రామకృష్ణ, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

గట్టు: ఓటు హక్కు కోసం కొత్తగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, ఈ విషయాన్ని బీఎల్‌ఓలు గ్రామాల్లో తెలియజేయాలని తహసీల్దార్ ధనుంజయ్ బీఎల్‌ఓలకు సూచించారు. గట్టు తహసీల్దార్ కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన బీఎల్‌ఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్, గిర్దావర్ శ్రీనివాసులు, వివిధ గ్రామాలకు చెందిన బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

కేటీదొడ్డి: మండలంలో ఓటరు శాతం పెంచేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని తహసీల్దార్ సరితా రాణి అన్నారు. సర్పంచు, పార్లమెంట్, ఎన్నికల నిర్వహణపై మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మీసేవ ఆపరేటర్లు, బీఎల్‌వోలు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డీటీ శివ శంకర్, మీసేవ ఆపరేటర్లు వెంకటేష్ నాయుడు, మౌలాలి, సిబ్బంది ఉన్నారు.

ఈకేవైసీకి బారులు తీరిన మహిళలు



గ్యాస్ ఏజెన్సీవద్ద క్యూలో నిలబడిన మహిళలు

అయిజ: ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ రూ.500 అందజేస్తుదని, దానికోసం లబ్దిదారులు గ్యాస్ ఏజెన్సీ కార్యాలయానికి వెళ్లి ఈకేవైసీ చేయించు కోవాలని సోషల్ మీడియాలో వదంతులు రావడంతో మహిళలు బుధవారం గ్యాస్ ఏజెన్సీ కార్యాలయం వద్ద బారులు తీరారు. ఈ సందర్భంగా లక్ష్మీశ్రీనివాస గ్యాస్ ఏజెన్సీ డిస్ట్రిబ్యూటర్ రాంకుమార్ మాట్లాడుతూ గత మూడు రోజులుగా లబ్దిదారులు ఈకేవైసీకి గ్యాస్ కార్యాలయానికి వస్తున్నారని, గ్యాస్ కార్యాలయానికి రావాల్సిన అవసరం లేదని అన్నారు. సిలిండర్లు సరఫరా చేసే సిబ్బంది లబ్దిదారుల ఇళ్ల వద్దనే ఈకేవైసీ చేస్తారని తెలిపారు.

ఘనంగా అయ్యప్పస్వామి పడిపూజ



ఇరుముడులతో శబరి బయలుదేరుతున్న అయ్యప్ప మాలాధారులు

అలంపూర్ రూరల్: మండలంలోని ఉట్కూర్ గ్రామంలో బుధవారం రంగస్వామి ఇంట్లో ఘనంగా అయ్యప్ప స్వామి పడిపూజను గురుస్వాములు లక్ష్మీనారాయణ, రఘు, శ్రీనివాసులు, ఎల్లయ్య గురు స్వాముల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. గణేష్, కుమారస్వామి, అయ్యప్ప స్వాముల చిత్ర పటాలకు అష్టోత్తరణ అర్చనలను చేశారు. పూలతో అలంకరించిన 18 మెట్ల పడికి ప్రత్యేక పూజలను నిర్వహించి నివేదన సమర్పించి మాల ధరించిన అయ్యప్ప స్వాములు పెటతుళ్లి అడారు. కార్యక్రమంలో శ్యామ్, రాము, విజయ్, నమ్మకం, ఓమేష్, కృష్ణ,, శ్రీనివాసులు, భక్తులు పాల్గొన్నారు.

శబరిమలకు అయ్యప్ప స్వాములు

ఉండవెల్లి: స్వామియే శరణమయ్యాప్ప అంటూ తెల్లవారుజామునే ఆలయంలో శరణాలతో మార్మోగింది. బుధవారం మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్ప మాలాధారులు 35 మందికి గురుస్వాములు ఇరుముడులు ధరించారు. అయ్యప్ప స్వామిక ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇరుముడులు దరించిన వెంటనే స్వాములు 18 మెట్లను ఎక్కి మంగళహారతులు తీసుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వాములు బస్సులో శబరిమలకు బయలుదేరారు. అర్చకులు ఆంజనేయ శర్మ, గురుస్వాములు దామోదర్ రెడ్డి, సూర్యకాంతారెడ్డి, రాముడు, నరసింహ, రాంబూపాల్ రెడ్డి పాల్గొన్నారు.